క్లుప్తంగా

షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపిక



అవార్డుకు ఎంపికైన లఖిదాసుపురం పాఠశాలకు చెందిన జశ్వంత్‌సాయి

నందిగాం: పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఇచ్చే షైనింగ్ స్టార్ అవార్డుకు నందిగాం మండలం నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో కణితూరు ఉన్నత పాఠశాలకు చెందిన గిన్ని అనూష(588 మార్కులు), లఖిదాసుపురం ఉన్నత పాఠశాలకు చెందిన బాలక జశ్వంత్ సాయి(582), నందిగాం గురుకుల పాఠశాలకు చెందిన యానాది దివ్య (575), సవరలింగుపురం గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన సవర లోకేష్ (541)లకు అవార్డులు వరించాయి. అవార్డులు పొందిన విద్యార్థులకు రూ. 20 వేలు నగదు, మెడల్, ప్రశంసాపత్రాన్ని ఈ నెల తొమ్మిదో తేదీన జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందజేయనున్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణుల వ్రతాలు



పూజలు చేస్తున్న మహిళలు

కవిటి: మండలంలోని కుసుంపురంలో వెలసిన వేణుగోపాలస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం లక్ష్మీనారాయణుల సామూహిక కుంకుమార్చన వ్రతాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. లలితా సహస్ర నామసహిత కుంకుమార్చనలు చేశారు. ఆలయ ఆవరణలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఉత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

ముగిసిన గ్రామ దేవత ఉత్సవాలు



అగ్నిగుండం తొక్కుతున్న భక్తులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని బెండి సీతాపురం గ్రామంలో మంగళవారం నుంచి మూడు రోజులు పాటు నిర్వహించిన కాళీ మాత ఉత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. 14 ఏళ్ల తరువాత అత్యంత వైభవంగా ఉత్సవాలను నిర్వహించారు. కాళీ మాత, గట్టుపోలమ్మ, పాతపట్నం అమ్మవార్లకు మొదటి రోజు చల్లదనంతో ప్రారంభమైన ఉత్సవాలు అనంతరం పగటి వేషాలు, సాంస్కృతిక నృత్యాలు, ఘట్టాలతో సందడిగా సాగాయి. చివరి రోజున కాళీమాత దాసుడు టి.డిల్లీరావు అగ్ని గుండంపై నడిచే కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మూడు సార్లు కాలుతున్న నిప్పుల అగ్ని గుండంపై నుంచి దాసుడు ప్రవేశించి వెళ్లడంతో జై కాళీ మాత అంటూ ప్రజలు జేజేలు పలికారు. ఈ అపురూప ఘట్టాన్ని చూసేందుకు బంధువులు, చుట్టుపక్కల గ్రామాల నుంచి అశేష జనవాహిని తరలి వచ్చింది. అనంతరం అమ్మవారికి మొక్కులు చెల్లించిన గ్రామస్తులు ఉత్సవాలను ముగించారు.

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వివిధ సేవల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా నేరుగా ఇంటి వద్ద నుంచి గ్రామ వలంటీర్లు, సచివాలయాల ద్వారా సేవలు పొందేవారు. అప్పటి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉన్నప్పుడు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు, రైతులకు విత్తనాలు, ఎరువులు, వైద్య సేవలు, విద్యార్థులకు అవసరమయ్యే కుల, ఆదాయ తదితర సర్టిఫికెట్లు, రేషన్ సరుకులు ఇంటి వద్దనే అందుకునేవారు. ఆయా శాఖల ఉద్యోగులే ప్రజల వద్దకు వచ్చి వారి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేవారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక వలంటీర్లను తొలగించి, గ్రామ సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్రలు చేపట్టింది. దీంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. ఏ పని జరగాలన్నా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి. దీంతో గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఇంటి వద్దకు చేరిన ప్రభుత్వ సేవలపై ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్నారు. – సాక్షి నెట్‌వర్క్



ఇంటి వద్దకే సేవలకు మంగళం!

- చిన్నపాటి ప్రభుత్వ సేవలకు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- కూటమి పాలనలో గడప గడపకూ పాలనకు చెల్లుచీటి



ఇచ్ఛాపురం రూరల్: నాడు: ఇంటి వద్దకే రేషన్ సరుకుల వాహనంలో సరుకులు పంపిణీ



ఇచ్ఛాపురం రూరల్: నేడు: ఐదు కిలో మీటర్ల దూరంలో ఉన్న డొంకూరు నుంచి అద్దె ఆటోలో రేషన్ సరుకులు తీసుకు వెళ్తున్న లక్ష్మీపురం లబ్ధిదారులు

ఇంటి వద్దకే సర్టిఫికెట్లు అందజేసేవారు



గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కావాల్సిన సర్టిఫికెట్లను వలంటీర్లే ఇంటికి వచ్చి అందజేసేవారు. ఎటువంటి సర్టిఫికెట్ కావాలో తెలుసుకుని గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే, రెండు..మూడు రోజుల వ్యవధిలోనే ఇంటి వద్దకే సర్టిఫికెట్ వచ్చేది. కూటమి సర్కార్ హయాంలో అలాంటి సేవలు కనిపించడం లేదు. – ఎస్.తిరుపతిరావు, పాతనౌపడ, టెక్కలి మండలం

సరుకులు తెచ్చేందుకు బాడుగకు ఆటో



బాలకృష్ణాపురం గ్రామ పంచాయతీలోని డెప్పూరు దళిత పల్లె మాది. 15 కుటుంబాలు నివసిస్తున్నాయి. గతంలో రేషన్ సరుకులు ఇచ్చేందుకు నేరుగా వాహనాలు మా గ్రామానికి వచ్చేవి. ఇప్పుడు వాటిని తొలగించడంతో ఐదు కిలో మీటర్ల దూరంలో ఉన్న బాలకృష్ణాపురం గ్రామానికి వెళ్లే పరిస్థితి. నడకదారిన వెళ్లలేక పోతుండటంతో సరుకులు ఇంటికి తీసుకురావాలంటే రూ.500 బాడుగకు ఆటో మాట్లాడుకుంటున్నాం. మా పరిస్థితి చాలా దారుణంగా ఉంది. రూ.50 వెచ్చించి కొనే సరుకుల కోసం ఒక్కొక్కరం వంద రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది. – బర్రు దాలమ్మ, డెప్పూరు, ఇచ్ఛాపురం మండలం

పథకాలన్నీ ఇంటికే వచ్చేవి



గత ప్రభుత్వ హయాంలో ప్రతీ ఇంటి తలుపుతట్టి అన్ని రకాల ప్రభుత్వ పథకాలు అందించేవారు. గడప గడపకు పింఛన్లు, రేషన్, వైద్యం, విత్తనాలు, ఎరువులు, ఆరోగ్య సేవు..ఒకటేమిటి అన్ని రకాల సౌకర్యాలు అందేవి. ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అటువంటి నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందించారు. ఇప్పుడు ఇవే పథకాల కోసం కిలోమీటర్లు నడిచి వెళ్లి ఎండలో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత పాలనకు ప్రస్తుత పాలనకు తేడాను ప్రజలంతా గమనిస్తున్నారు. రానున్న రోజులలో కూటమి సర్కార్‌కు ప్రజల బుద్ధి చెప్పడం ఖాయం. – బోర భగవతి, 25వవార్డు, పలాస

ఇంటింటికీ సేవలు అందడం లేదు



గత ప్రభుత్వం హయాంలో గ్రామ వాలంటీర్ల ద్వారా ఇంటివద్దకే సేవలు అందేవి. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచినా ప్రజలకు ఎటువంటి సేవలు అందడం లేదు. రేషన్ సరుకుల కోసం నానా ఇబ్బందులు పడుతున్నాం. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతుల ఇంటి వద్దకే ఎరువులు, విత్తనాలు వచ్చేవి. చంద్రబాబు పాలనలో ఏఒక్క పథకం సక్రమంగా అమలు కావడం లేదు. – మద్దిల పాపారావు, రైతు, మామిడిపల్లి, పలాస మండలం

వలంటీర్లను తొలగించి కష్టాలు తెచ్చారు..



ఒకటో తారీఖు వస్తే ఇంటింటికీ వెళ్లి తలుపుతట్టి పింఛన్ అందించే సంస్కృతి నుంచి ప్రతీ పనికి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వచ్చింది. ఏమి కావాలని ఇంటికి వచ్చి అడిగి తెలుసుకునే వలంటీర్లపై లేనిపోని నిందారోపణలు చేసి వారిని తొలగించడంతో కష్టాలు ప్రారంభమయ్యాయి. ఉన్న ఊరులో ఇంటివద్ద ఉంటూ గ్రామానికి సేవ చేయాలనుకునేవారికి తీరని అన్యాయం చేశారు. ఇప్పుడు వారి విలువ తెలుస్తుంది. రెండింతలు పెంచి పరిహారం ఇస్తామన్న వారు ఇప్పుడు వలంటీర్లను లేకుండా చేసేశారు. – చింతాడ మాధవరావు, సున్నాడ గ్రామం, పలాస మండలం

కూటమి పాలనలో కష్టాలే..



గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఇంటి వద్దకే చేరిన ప్రభుత్వ సేవలు ఇప్పుడు కనిపించడం లేదు. దీనికి రేషన్ పంపిణీ ఒక నిదర్శనం. గతంలో ప్రభుత్వ సేవల కోసం ఏ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పని ఉండేది కాదు. మా గ్రామాల్లోనే సేవలు అందుకునేవాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి...కూటమి ప్రభుత్వానికి తేడాను ఏడాది పాలనలో ప్రజలు బాగా తెలుసుకున్నారు. – జి.యర్రన్నరెడ్డి, బూరగాం, టెక్కలి మండలం.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థినుల ఎంపిక



జీరు ఉమామాధురి



కోరాడ రక్షిత

కంచిలి: మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్‌కు) ఎంపికయ్యారు. తాజాగా విడుదలైన ఫలితాల్లో డోలగోవిందపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదివిన జీరు ఉమామాధురి జిల్లాస్థాయిలో నాలుగో ర్యాంకు సాధించినట్లు పాఠశాల హెచ్ఎం సీహెచ్ లక్ష్మీకాంతం శుక్రవారం తెలిపారు. ఉమామాధురికి 154 మార్కులు వచ్చాయని తెలిపారు. అలాగే కత్తివరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న కోరాడ రక్షిత కూడా ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికై నట్టు హెచ్ఎం మాధవి బెహరా తెలిపారు. వీరికి ఇంటర్మీడియెట్ పూర్తయ్యేవరకు ప్రతీ ఏడాది స్కాలర్‌షిప్ వస్తోందన్నారు.



కవిటి: బొరివంకలో విజేతలకు మిఠాయి తినిపిస్తున్న హెచ్ఎం రామకృష్ణ

బొరివంకలో 8 మంది..

కవిటి: జాతీయ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ కోసం నిర్వహించిన పరీక్షలో బొరివంక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో దున్న చందు, బార్ల శ్రీకర్, శమ్మర జాహ్నవి, బి.రుషి, డి.వినయ్, ఎం.పూర్ణిమ, ఎం.ఐశ్వర్య, డి.కావ్య ఉన్నట్టు హెచ్ఎం హెచ్ఎం సనపల రామకృష్ణ తెలిపారు. పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ బెందాళం శ్రీరాంప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు దుద్ది సతీష్, ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే కవిటి ప్రభుత్వ పాఠశాల, శిలగాం, ముత్యాలపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన 12 మంది విద్యార్థులు కూడా ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైనట్టు ఉపాధ్యాయవర్గాలు తెలిపాయి.

యోగా సాధన



యోగా సాధనలో ఎమ్మెల్యే శిరీష, ఆర్డీవో వెంకటేష్ తదితరులు

కాశీబుగ్గ: కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం యోగాంధ్ర కార్యక్రమాన్నినిర్వహించారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, ఆర్డీవో జి.వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు, ఎంపీడీవో రమేష్ నాయుడు, పశువైద్యశాఖ ఏడీ చంద్రశేఖరం, హెచ్ఎం చిన్నంనాయుడు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు వేణుగోపాలస్వామి కల్యాణం

ఇచ్ఛాపురం టౌన్: పట్టణంలోని పెద్దజగన్నాథస్వామి ఆలయంలో శనివారం రుక్మిణీ, సత్యభామ వేణుగోపాల స్వామి కల్యాణాన్ని నిర్వహించనున్నారు. దీని కోసం ఏర్పాట్లు చేసినట్టు ఆలయ మేనేజర్ బెండి రామారావు శుక్రవారం తెలిపారు. ఉదయం స్వామి వార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు, అంకురార్పణ, ధ్వజారోహణ, హోమాలు నిర్వహిస్తామన్నారు.

కుట్టు శిక్షణ ప్రారంభం

టెక్కలి: ఏపీ బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో టెక్కలిలో మహిళల కోసం ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు, నాయకులు కోరారు. కార్యక్రమంలో బి.శేషగిరి, ఎం.దమయంతి, ఎం.రాము, పి.షణ్ముఖరావు, బి.అప్పలస్వామి, బెహరా కాళీ, ప్రసాద్‌రెడ్డి, ప్రీతీష్ పాల్గొన్నారు.

'కూటమి సర్కార్‌పై.. ప్రజలు విసిగిపోయారు'

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి దుర్యోధనరావు



దుర్యోధనరావు

కాశీబుగ్గ: కూటమి ప్రభుత్వం ఒక్క ఏడాదిలోనే కొనసాగించిన అసమర్థ పాలనపై ప్రజలు విసిగి వేసారి పోయారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు అన్నారు. దీనికి ఇటీవల చేపట్టిన 'వెన్నుపోటు దినం'నిరసన కార్యక్రమం విజయవంతం కావడమే నిదర్శనమన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో వంచన, మోసాలను ప్రశ్నిస్తూ ప్రజలకు న్యాయం చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని రాష్ట్రంతో పాటు, పలాస నియోజకవర్గంలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం విజయవంతమైందన్నారు. ఎన్నికల ముందు అధికారం కోసం అమలు చేయలేని హామీలు ఇచ్చి, తీరా అధికారంలోకి వచ్చాక బడ్జెట్ లేదంటూ సాకులు చెప్పడం కూటమి పాలకులకే చెల్లిందని విమర్శించారు. హామీలను అమలు చేయకపోగా రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో పోలీసులను కీలుబొమ్మగా వాడుకుంటున్నారని, ప్రశ్నించే గొంతులను నొక్కుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఈ నిరసన కార్యక్రమాల్లో ప్రజలు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున భాగస్వామ్యులు కావడం విశేషం అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పెద్దలు కళ్ళు తెరవాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కంచమ్మతల్లిని దర్శించుకున్న మాజీ మంత్రులు



కంచమ్మ తల్లిని దర్శించుకున్న మాజీ మంత్రులు ప్రసాదరావు, అప్పలరాజు, జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్సీ తిలక్ తదితరులు

కంచిలి: కంచిలిలో కంచమ్మతల్లి అమ్మవారిని మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, డాక్టర్ సీదిరి అప్పలరాజు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి పేరాడ తిలక్ తదితరులు శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు నాయకులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు పైల దేవదాస్‌రెడ్డి, ఇప్పిలి లోలాక్షి, శ్రీరాములు, ఇప్పిలి కృష్ణారావు పాల్గొన్నారు. కేంద్రమాజీ మంత్రి కిల్లి కృపారాణి రామ్మోహన్‌రావు దంపతులు కంచమ్మతల్లి అమ్మవారిని దర్శించుకున్నారు.

వైభవంగా ఉత్సవాలు

కంచమ్మతల్లి గ్రామదేవత ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారితోపాటు భద్రాచలం వారి కొమ్ముల డ్యాన్స్, తాడేపల్లిగూడెం వారి అమ్మవార్లు, శివశూలాలు, దాండియా, గ్రూప్ డ్యాన్స్, ఒడిశా పద్మనాభపురం పాలబొమ్మలు వీధి ప్రదర్శనలు అందర్నీ ఆకట్టుకొన్నాయి.

మరోవైపు ఈశ్వరీయ బ్రహ్మకుమారీలుచే ప్రవచనాలు, అదే స్టేజీపై కోలాట నృత్యం, చిన్నాతో కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలు ఇచ్చారు. మరోవైపు కళ్లు మిరుమిట్లుగొలిపే లైటింగ్‌తో రెండు చోట్ల ఎగ్జిబిషన్ల వద్ద ప్రజలు వచ్చి సందడి చేస్తున్నారు.



చిన్నారి నృత్య ప్రదర్శన



ఎగ్జిబిషన్ వద్ద సందడి

ఉచిత వైద్య శిబిరం



వజ్రపుకొత్తూరు మండలం దేవునల్తాడలోబావనపాడు మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. బావనపాడు మెరైన్ సీఐ డి.రాము ప్రారంభించిన వైద్య శిరంలో 200 మంది వరకు రోగులకు రాగోలు జెమ్స్ వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యులు బి.వంశీక్రిష్ణ, జి.సంధ్యారాణి, పి.శరత్ చంద్ర, జి.కీర్తి తదితరులు రోగులకు బీపీ, సుగర్, ఈసీజీ, 2డీ ఇకో, కంటి వైద్య పరీక్షలు చేశారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని రిమ్స్‌కు రిఫర్ చేశారు. మెరైన్ ఎస్సైలు వి.శ్రీనివాసరావు, బి.మన్మథరావు, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. – వజ్రపుకొత్తూరు

జలాభిషేకం..



వర్షాలు మెండుగా సమృద్ధిగా కురవాలని, పాడి పంటలు సుభిక్షంగా పండాలని కోరుతూ ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి గ్రామానికి చెందిన ప్రజలు ఆర్తీశ్వర స్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బిందెలతో బహుదానది నుంచి నీరు తెచ్చి గ్రామంలో కొలువైన ఆర్తీశ్వర స్వామికి జలాభిషేకం చేశారు. అధిక సంఖ్యలో మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు. – ఇచ్ఛాపురం రూరల్

జాతర ప్రారంభం



పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పదోవార్డు పొందరవీధిలోని పెంటపోలమ్మ అమ్మవారు జాతర మహోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. ఉదయం నాలుగు గంటలకు అమ్మవారికి మేలుకొలుపు, మంగళస్నానం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. విచిత్ర వేషధారణ, స్టేజి వేషాలతో కళాకారులు సందడి చేశారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. నాలుగు రోజులు జాతర జరగనుందని కమిటీ సభ్యులు పెంట సంజీత్, రూప్ సుందర్, ఉమాకాంత్, శివ, షణ్ముఖరావు, శివ, నాగరాజు, భగీరధి, రాజేంద్ర, గిరి, విజయ్, నవీన్ తెలిపారు. – కాశీబుగ్గ

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు



మందస: ముగింపు శిబిరంలో పిల్లలు



సంతబొమ్మాళి: బహుమతులు అందజేస్తున్న ఎంఈవోలు చిన్నవాడు, అర్జునుడు



నందిగాం: బహుమతులతో విద్యార్థులు



ఇచ్ఛాపురం టౌన్: విద్యార్థినికి బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

మందస: గ్రంథాలయాల్లో సుమారు 45 రోజులు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. పిల్లలకు చదువు, క్రీడలు, ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలపై అవగాహనతో పాటు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. మందస శాఖా గ్రంథాలయంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో స్థానిక మేజర్ పంచాయతీ ఈవో బమ్మిడి నవీన్ మాట్లాడుతూ.. విజ్ఞాన శిబిరాల్లో తెలియజేసిన విషయాలు విద్యార్థులు సరైన మార్గంలో ప్రయాణించడానికి ఎంతో దోహదపడతాయన్నారు. వివిధ పోటీల్లో గెలిచిన పిల్లలకు బహుమతులు అందజేశారు. స్థానిక గ్రంథాలయ అధికారి కె.విజయలక్ష్మిని ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో టి.జైరామ్ మాస్టార్, వీఆర్వో శ్రీకాంత్, ఆర్.మోహన్‌రావు, యోగి, పాఠకులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: సంతబొమ్మాళి శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. ఎంఈవోలు చిన్నవాడు, అర్జునుడు చేతులు మీదుగా వివిధ పోటీలలో గెలిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని..వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శాఖాగ్రంథాలయాల అధికారి కె. రామ్రకిష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందిగాం: వేసవి సెలవుల్లో విద్యార్థులు గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసిన విజ్ఞాన శిబిరాలను వినియోగించుకొని తమ కాలాన్ని సద్వినియోగం చేసుకున్నారని నందిగాం శాఖా గ్రంథాలయాధికారి ఎస్.ఉదయ్‌కిరణ్ అన్నారు. శిబిరం ముగింపు సందర్భంగా ఇటీవల నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. పలువురు పాఠకులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం టౌన్: వేసవిలో విజ్ఞాన శిబిరాల ముగింపు కార్యక్రమం స్థానిక గ్రంథాలయంలో నిర్వహించారు. క్విజ్, వ్యాసరచన పోటీలలో గెలుపొందిన వారికి అతిథులు బహుమతులను ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు సురేష్ చంద్ర పండా, పి.విజయ్‌కుమార్, గ్రంథాలయ అధికారి పూర్ణచంద్రబెహరా, గ్రంథాలయ సహాయకులు ఎస్.బెహరా, విద్యార్థులు పాల్గొన్నారు.